


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

## 6

**సుశీల పురుషోత్తం,** భాగ్యలక్ష్ముల కూతురు. మద్రాసులో పురుషోత్తం వ్యాపారం చేసేవాడు. భార్యా, కూతుళ్లతో ఆయనది ఆనందమయ జీవితం. అయిన వారందరికీ దూరమై, దూరప్రాంతంలో ఒకరికి ఒకరిగా బ్రతుకుతున్న దంపతులు వారు. వారిది ప్రేమ వివాహం. వారికి సంతానం సుశీల ఒక్కతే. ఆమె వారి పెళ్ళి అయిన ఇరవై సంవత్సరాల తరువాత, వాళ్ళు సంతానం మీద ఆశలు వదలుకున్నాక పుట్టడంతో తల్లిదండ్రులకు ప్రాణం. సుశీల కిప్పుడు మూడవ సంవత్సరం. ఆమెను ఎంతో అల్లారుముద్దుగా పెంచుకు వస్తున్నారు ఆ దంపతులు. మద్రాసు ప్రాంతంలో చిన్న హోటల్ నడుపుతుండేవాడు పురుషోత్తం. సంసారం సుఖంగా జరిగిపోతుండగా స్పానిష్ ఫ్లూ మహమ్మారి మద్రాస్ లో వ్యాపించటం మొదలయ్యింది. ప్రజా జీవన సరళి మొత్తం ఒక్కసారిగా మారిపోయింది జనాభా పిట్టల్లా రాలిపోవడం మొదలయ్యింది.

పురుషోత్తం హోటల్ కి వచ్చి రోజూ భోజనం చేసేవారు, ఆ రోజు వస్తే మర్నాడు కనిపించేవారు కారు. ఈ పరిణామం ఏమిటో పురుషోత్తంకి మొదట్లో అర్థం కాలేదు. పక్కన చిన్న కిరాణా కొట్టు యజమాని ఉన్నట్టుండి మరణించాడు. ఎదురుగా ఉన్న సైకిల్ బాగుచేసే దుకాణం మూతపడింది.వీధి వెంట జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. క్రమక్రమంగా వ్యాధి మద్రాసు నగరాన్ని తన గుప్పిట లోకి తీసుకుంది. వ్యాధి తీవ్రతను అర్థం చేసుకునే లోపే ఆ మహమ్మారి జనాన్ని కబళించడం మొదలు పెట్టింది.

ఉన్నట్టుండి ఒకరోజు భాగ్యలక్ష్మికి జ్వరం వచ్చింది. ఆమె దానితోటి లేవలేక పోయింది. మూడంటే మూడే రోజుల్లో ఆమె కన్ను మూసింది. పురుషోత్తంకి మతిపోయినట్లయ్యింది. జీవితాంతం కలిసి ఉండటానికి తనవారి నందరిని వదిలేసుకొని వచ్చిన భార్య! ఇప్పుడు తననిలా ఒంటరిని చేసి వెళ్లిపోయిం దేమిటీ?

ఆమెను దహనం చేద్దామంటే విశ్వప్రయత్నం చేసినా అతనికి కుదరలేదు. పురోహితుడు దొరకలేదు, కట్టెలకి కరువు. మోసే మనుషులు దొరకటం కూడా గగనమైపోయింది. అసలు బయటకు వెళ్ళే పరిస్థితే లేదు. నిస్సహాయంగా ఆమె శవాన్ని సముద్రం వొడ్డున పడేసి, జీవచ్ఛవంలా ఇంటికి తిరిగి వచ్చాడు పార్వతీశం. ఆరోజున అతను పడ్డ వేదన వర్ణనాతీతం. అసలు తనెందుకు బ్రతికి ఉన్నానా అనిపించిందతనికి.

ఆ వ్యాధి తీవ్రత అర్థమైన కొద్దీ అతని మతి పోయింది.ఎటుచూసినా అసంఖ్యాకమైన మరణాలు. నిన్న చూసినవారు ఈ రోజు ప్రాణంతో ఉంటారని నమ్మకం లేదు. ఎవరూ ఎవరినీ కలవట్లేదు. ఇంట్లోంచి బయటకు రావటానికే

భయపడుతున్నారు. అది బొంబాయి జ్వరమని, ఎవరికి వారు వాళ్ళ ప్రాణ రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని, భారత దేశంలో దాని వ్యాప్తి విపరీతంగా ఉన్నదని ఊరంతా నోటీసులు అంటించారు.

రెండు రోజులు గడవకుండానే పురుషోత్తంకి జ్వర లక్షణాలు కనిపించాయి. అతనికి అమితమైన భయం వేసింది. తనకేమైనా అయితే కూతురికి దిక్కెవరు?

"నాన్నా,ఆకలేస్తోంది " తండ్రికి దగ్గరగా రాబోయింది సుశీల.

"సుశీలా, నా దగ్గరకి రాకమ్మా. నాకూ జ్వరం వచ్చేలా ఉంది. ఇదేదో విషపు జ్వరంలా ఉంది. నా గాలి కూడా నీకు సోకకూడదు. దూరంగా ఉండు తల్లీ. బయట ఏమైనా తినడానికి దొరుకుతుందేమో చూసి వస్తా"

కూతురికి ధైర్యం చెప్పి బయటకు వచ్చాడు పురుషోత్తం. ఊరంతా తిరిగినా ఒక్క దుకాణం తెరిచి లేదు. సహాయం కోసం పక్కింటి వారి తలుపు తడితే ఆ తలుపు తెరుచుకోనేలేదు.ఊరంతా స్మశానంలా ఉన్నది. రోడ్ల మీద శవాలు పడి ఉన్నాయి. ఆ భీభత్సమైన వాతావరణం చూసి అంత లావు మగవాడికీ కాళ్లల్లో వణుకు పుట్టింది. ఈ ఊరేనా ఇన్నాళ్లు అన్నలక్ష్మిలా తమని ఆదుకుంది! ఈ వీధులేనా నిరంతరం జనసందోహంతో కళకళలాడింది! ఇవాళ ఇంత నిర్మానుష్యంగా ఉన్నాయేమిటి? ఒక్క సారిగా నీరసపడిపోయాడు పురుషోత్తం. అందరికీ తిండి పెట్టె వ్యాపారంలో ఉన్న తను, ఆఖరికి కన్న కూతురికి అన్నం పెట్టలేని పరిస్థితికి వచ్చాడా!

ఉత్త చేతులతో తిరిగి వచ్చాడు పురుషోత్తం. అతని జ్వరం ఎక్కువైంది. అతనికి అర్థమైంది. ఆ విషజ్వరమేదో తనకి వచ్చింది. తాను కూడా మరణిస్తాడు. ఆ ఊహతోనే కూతురి భవిష్యత్తు గురించిన బాధ, భయం అతన్ని పిండేశాయి. దిక్కులేనిదై పోతుందా సుశీల? జ్వరం, తలనొప్పులతో అతని కళ్ళు మూసుకు పోతున్నాయి. సుశీల గట్టిగా ఏడవటం మొదలు పెట్టింది. ఆ ఏడుపు వినపడో ఏమో ఎవరో వీధి తలుపుని బాదుతున్నారు. లోపలనుంచి ఎటువంటి జవాబూ లేకవాళ్ళు తలుపులు పగులకొట్టి లోపలి వచ్చారు.సుశీల ఆ శబ్దాలకి బెదిరిపోయి మరింత గట్టిగా ఏడవసాగింది.మొహాన్ని ముసుగులతో కప్పుకున్న వారెవరో అక్కడికి ఎందుకు వచ్చారో చిన్నారి సుశీలకు అర్థం కాలేదు. వాళ్ళ ముందు వారందరికీ సారథ్యం వహిస్తున్నట్టు ఒక స్త్రీఉంది.

ఆమె ఏడుస్తున్న సుశీలను ఎత్తుకుని, లాలనగా "భయపడకమ్మా. ఇంట్లో ఎవరున్నారు?" అంటూ ముందుకి వచ్చి ఒక సంచి అక్కడ పెట్టింది. దానిలో పండ్లు, బ్రెడ్, బియ్యం, మందులు వంటివి ఉన్నాయి. ఆమె అక్కడే పడుకుని ఉన్న పురుషోత్తముని చూసింది. మూసుకుపోతున్న కళ్ళను విప్పి చూడాలని ప్రయత్నిస్తున్న పురుషోత్తంను చూడగానే శయనమ్మకు అంతా అర్థమయ్యింది.

"అమ్మేది పాపా?" అని సుశీలను అడిగింది. తనతో తెచ్చిన గుడ్డను సుశీల కళ్ళు మాత్రం వదిలి మిగిలిన మొహానికి చుట్టింది ఆమెను బుజ్జగిస్తూ.

"లేదు, నాన్న దేముడి దగ్గర దింపి వచ్చాడట." సుశీల ఏడుపు ఆపకుండానే సమాధానం చెప్పింది. శయనమ్మ కంట్లో నీళ్లు నిండాయి. అప్రయత్నంగా ఆ పాపను దగ్గరకు తీసుకుంది. భయపడొద్దన్నట్లు తల మీద చెయ్యి వేసి నిమిరి ఆమెను పక్కనున్న సహాయకుడికి అందించి పురుషోత్తం వైపు చూస్తూ అన్నది.

"మీ చుట్టాలెవరన్నా ఉంటె వారి చిరునామా చెప్పండి. పాప నక్కడ దింపిస్తాను."

పురుషోత్తం అతి కష్టం మీద రెండుచేతులు పైకెత్తి శయనకు దణ్ణం పెడుతూ అన్నాడు." అమ్మా, దేవుడు పంపించినట్లు వచ్చారు మీరు. మాకెవరూ లేరు. పాప ఒక్కతే. దాని అమ్మ కూడా జ్వరంతో మరణించింది. అది దిక్కులేనిది కాకుండా చూడండి.. పాప భారం మీదే. వెనుకగదిలో పెట్టె..."అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. నిట్టూర్చింది శయన. ప్రాణం పోవటం ఎంత తేలికై పోయింది? శయనమ్మ ఏ వస్తువునూ తాకకుండా అక్కడకు వెళ్ళి ఆ పెట్టె తెరిచింది. సుశీల పక్కనే నిలిచి చూస్తోంది.

ఆ కావిడిపెట్టెలో కావలసినన్ని డబ్బులు, నగలు ఉన్నాయి. గోడకు వేలాడుతున్న వారు ముగ్గురు ఉన్న ఫోటోను, పెట్టెలోని నగలను, డబ్బును తీసి ఒక బట్ట సంచిలో పెట్టింది శయనమ్మ. వెంట వచ్చిన స్వయం సేవకులకు ఏమి చెయ్యాలో సూచించి సుశీలతో సహా బయటకు వచ్చేసింది.

సుశీల వయసు జరిగింది పూర్తిగా అర్ధం చేసుకునేంత పెద్ద వయసు కాదు. కానీ ఆమెకు తన జీవితంలో ఏదో జరగరానిది జరిగిందని మాత్రం అర్ధమయ్యింది. తనను చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న ఆ స్త్రీయే తన పట్టుగొమ్మ అన్నట్లు ఆమె చెయ్యి విడువలేదు సుశీల. శయనమ్మ తన బసకు రాగానే ముందు సుశీలను వేడినీళ్ళతో స్నానం చేయించి తను కట్టుకున్న బట్టలని బయట పడేసి తగలేయించింది. వేరే బట్టలను వేసింది. సుశీల చేత రొట్టె తినిపించి నిద్ర పుచ్చింది సుశీల స్నానం చేసి ఇచ్చిన దేదో తిని వొళ్ళు తెలియకుండా నిద్రపోయింది.

శయనమ్మ ఒక్క క్షణం ఊరికే లేదు. బాధితులకు అందించవలసిన సాయం వివిధ రూపాలలో అందిస్తూనే ఉంది. కొందరి కోసం ఆహారం, నిత్యావసర వస్తువులు, శుభ్రపరచిన బట్టలు పొట్లాలు కడుతోంది. కొందరికివ్వటానికి డబ్బులను విడివిడిగా పెడుతోంది. ఇంకొందరికి కొంతమంది చేత అక్కడే వండిన ఆహార పదార్ధాలను పొట్లాలు కట్టిస్తోంది.

చనిపోయిన వారి గురించి బాధపడటం కంటే, మృత్యు మొహంలో ఉన్న వారిని బ్రతికించడం చాలా ముఖ్యం అన్నది శయనమ్మకు బాగా తెలుసు. ఇంచుమించు మూడు నెలలు గడిచాక పరిస్థితులలో మార్పు వచ్చింది క్రమక్రమంగా

కేసులు తగ్గు మొహం పట్టసాగాయి. శయనమ్మ కాస్త స్థిమిత పడింది. ఇన్ఫ్లుఎంజాకి వ్యతిరేకంగా సంఘటిత పడ్డ సంఘాల వారు వీలైనంతగా ప్రజలలో అవగాహన పెంచారు. ఎవరికి వారు పరిసరాలను, ఇళ్లను శుభ్రం చెయ్యటం, వ్యక్తిగత శుభ్రత పాటించటం వంటివి దినచర్యలో భాగం చేసుకున్నారు.

చివరికి అందరి సమిష్టి కృషి ఫలితంగా అనుకోవచ్చు లేదా ఆ రోగకారకక్రిమి జీవిత చక్రం పూర్తి అయ్యి కావచ్చు 1920కి బొంబాయి జ్వరం అని పిలువబడే స్పానిష్ ఫ్లూ నశించింది. అయితే, ప్రపంచం మొత్తం మీదా ఆ వ్యాధి వలన ఐదు నుంచి పది కోట్ల మంది మరణించి ఉంటారని ఒక అంచనా. ఇది మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించిన వారి సంఖ్య కంటే ఎక్కువ. బాధితుల వివరాలను మొదటగా బయటపెట్టిన స్పెయిన్ దేశం పేరున ఆ ఫ్లూ చరిత్రలో స్పానిష్ ఫ్లూ గా మిగిలి పోయింది.ఆ వ్యాధి వెళ్తూ వెళ్తూ ప్రపంచానికో హెచ్చరిక చేసి వెళ్ళింది. మానవుడు ప్రపంచ యుద్ధాలు చేసేటంతటి గొప్పవాడే కావచ్చు, కానీ మనుష్య జాతి యావత్తుని నాశనం చేసే శక్తి కంటికి కూడా కనిపించనంత ఒక చిన్న క్రిమికి ఉంది.' అని.

నిజానికి సహజంగా శాంతించబట్టే ఆ రోగం అదుపులోకి వచ్చిందే కానీ, ఆ రోజులలో ఇప్పటిలాగా యాన్ టి బయోటిక్స్ లేవు, యాంటీ వైరల్స్ లేవు. కేవలం దేశవాళీ వైద్య విధానాలే. వ్యాధి నెమ్మదించిన తరువాత కూడా కొన్నేళ్ళ వరకు పాలించే ప్రభువులనే పారిపోయేలా చేసిన ఆ వ్యాధిని తలచుకున్నా పీడ కలలే వచ్చేవి జనానికి.

## 7

**స్పా**నిష్ ఫ్లూప్రపంచం నుంచి, ముఖ్యంగా భారత దేశం నుంచి పూర్తిగా కనుమరుగై పోయినా, శయనమ్మ మనసులో మటుకు ప్రజల దుస్థితి, వారి కష్టాలు అలాగే ఒక ఛాయా చిత్రంలాగా ముద్రింపబడి ఉండిపోయాయి. పూనిక తీసుకుని ఒక యజ్ఞంలా సేవను చేసిన శయనమ్మ గారికి ఆ వ్యాధి సద్దుమణిగే వేళ్టికి ఒంట్లో ఆవగింజంత శక్తి మిగల లేదు.శారీరకంగా చాలా బలహీన పడిపోయిందామె. అయితే మానసికంగా అమిత శక్తిమంతురాలయ్యింది.అప్పటి వరకు తను అనుభవించినవే ప్రపంచంలో కెల్లా పెద్ద కష్టాలని ఆవిడ ఉద్దేశ్యం. కానీ బొంబాయి జ్వరం ఆవిడకు నిజమైన కష్టాలను పరిచయం చేసింది. నిస్సహాయ స్థితిలో కేవలం ప్రాణాలు నిలుపుకుంటే చాలు, ఏ కష్టమైనా పడగలం అని పెనుగులాడే కోటీశ్వరులని కొన్నివందల్లో చూసింది శయనమ్మ. బ్రతకటమే, భగవంతు డిచ్చిన ప్రాణాలను నిలుపుకోవటమే, గొప్ప వరంగా లక్షలమంది ఒకే సారి ప్రపంచ వ్యాప్తంగా పెనుగులాడటం చూసిన ఆమెకు, ఆరోగ్యమే మహా భాగ్యమంటే అర్ధం ప్రత్యక్షంగా తెలిసింది. నిస్సహాయులకు సేవ చేయటంలో ఎంత ఆత్మానందం ఉన్నదో ఆవిడకు అనుభవం లోకి వచ్చింది. బొంబాయి నుంచి అలహాబాద్, కలకత్తాలలో సేవలు ముగించి చివరిగా మద్రాసు చేరిన ఆమె అక్కడ నుంచి గుంటూరుకి బయలుదేరింది సుశీలతో సహా.

సుశీల బాధ్యతను తీసుకోవటానికి చాలా సందేహించింది శయనమ్మ. ఆమె బ్రతక దలచిన జీవనవిధానానికి సుశీల ప్రతిబంధకమే. కానీ ప్రపంచంలోనే ఎవరూ లేకుండా మిగిలిపోయిన సుశీల ను తాను కూడా అనాధగా ఎలా వదిలివెయ్య గలదు?. ఇప్పుడు ఆమె సేవలందించిన వారంతా ఆమెకు ఆత్మీయులే. చాలామంది ఆమెను అక్కడే ఉండిపొమ్మని బలవంత పెట్టారు కూడా. గట్టిగా ఆలోచించి వారిలో ఎవరో ఒకరి దగ్గర సుశీలను వదిలి వెళదామా అనుకుంది. కానీ లోకం చూడని సుశీలను అలా వదిలి వెళ్లడానికి ఆమె మనసు అంగీకరించలేదు. తనని చూడగానే 'అమ్మా' అంటూ కౌగిలించుకుని ఆ చిన్నారి ప్రేమబంధంలో చిక్కుకోక తప్పలేదు శయనమ్మకి. ఆఖరికి ఆమెను తనతో తీసుకు వెళ్ళడానికి నిర్ణయించుకుంది శయనమ్మ.

ఆనాడు వచ్చి బొంబాయిలో ఆదరంగా తీసుకువెళ్లిన పెద్దమనిషి ఈ నాడు లేడు. మహమ్మారికి బలి అయ్యాడు. గుంటూరు నుంచి అక్కడ కాలు పెట్టిన తాను ఇవాళ ఈ మద్రాసు మహానగరం నుంచి తిరుగు ప్రయాణ మవుతోంది. ప్రపంచంలోనే ఒంటరి అయిన తనకు ఈనాడు ఈ సుశీల ఒక బాధ్యత అయ్యింది. జీవితం ఎన్ని చిత్రమైన మలుపులు తిరుగుతోందో. ఏదీ మన చేతుల్లో లేదు అని అనుకుంది శయనమ్మ. మానవ సేవే తన గమ్యం అని నిర్ణయించుకుని, దాని కనుగుణంగా జీవించాలనే లక్ష్యంతో తిరుగు ప్రయాణం మొదలుపెట్టిందామె. ఆమె చేసిన అవిరళ సేవకు ఆమె పేరు విన్న జనం చెయ్యెత్తి దణ్ణం పెడుతున్నారు. ముఖ్యంగా ప్రవాసాంధ్రులు అందరూ. దక్షిణ భారతదేశంలో ఒక చిన్న ఊళ్ళో పుట్టిన ఆమె, భాష కూడా తెలియని ఎన్నో ప్రాంతాలకు వెళ్లి, ఎంతో మందికి సేవ చేస్తానని అనుకుందా? అనుకోనివి జరగటమే జీవితం కాబోలు.

మొత్తానికి అనేక మజిలీలు అయ్యాక చివరికి గుంటూరు చేరుకుంది శయనమ్మ మూడేళ్ళ పసిపాప సుశీలతో.

## 8

**బా**పట్ల దగ్గర ఓ కుగ్రామంలో ఉంటారు హైమవతి తల్లిదండ్రులు సుబ్బమ్మ, కేశవరావు గార్లు. కేశవరావుకి ఒక చెల్లెలు ఉండేది. తల్లిదండ్రులతో ఉత్తర దేశ యాత్రలకు వెళ్ళినప్పుడు ఆ అమ్మాయి మశూచి సోకి మరణించింది. కేశవరావుకు పెళ్ళి చేసి, కోడలు కాపురానికి కూడా రాకముందే కూతురి మీద బెంగతో తల్లి, తరువాత కొంతకాలానికే తండ్రి కూడా మరణించారు. తల్లిదండ్రుల మరణం తరువాత కేశవరావు ఒక్కడే మిగిలాడు ఆ కుటుంబంలో. ఎన్నడో, చిన్ననాడు తల్లిదండ్రులు, చెల్లెలితో తీయించుకున్న ఫోటో ఒకటి చెక్క ఫ్రేములో వేలాడుతూ, దూరమైన ఆ ముగ్గురిని అతనికి గుర్తు చేస్తుంటుంది. అనుకూలవతి అయిన భార్య సుబ్బమ్మ,అతన్ని ఆ వంటరి తనం నుంచి తప్పించింది. వారికి హైమవతితో కలిపి అయిదుగురు సంతానం. కూతురు హైమవతికి, పెద్దకొడుకు సుబ్బారావుకి కూడా పెళ్లిళ్లు అయ్యాయి. ఆ కాలంలో ఆడపిల్లలకు పెద్దమనుషు లవకుండానే పెళ్ళిళ్ళు జరగడం సర్వ సాధారణం.

హైమవతి పెళ్ళి ఆమె ఎనిమిదవ ఏటనే గుంటూరుకు చెందిన పార్వతీశంతో జరిపించారు. పార్వతీశం తండ్రి రెండువందల ఎకరాల మోతుబరి. కొలకలూరు ప్రాంతాల్లో సుక్షేత్రమైన మాగాణీ. పార్వతీశంతో హైమ పెళ్ళి నాటికి అతనింకా చదువుకుంటున్నాడు.

ఇక సుబ్బారావు భార్య శారద. విజయవాడ సంబంధం. ఆమెకు చాకలి పద్దులు రాయడం వరకే చదువు. ఇల్లు సమర్ధవంతంగా చక్కపెట్ట గలదు. పెద్ద కలిగిన కుటుంబమేమీ కాదు. పిల్ల గుణగణాలను గురించి విన్న కేశవరావుగారు కట్నానికి ఆశించకుండా తన ఇంటి కోడలిని చేసుకున్నారు. సుబ్బమ్మగారు కూడా శారదను కూతురి లాగానే కడుపులో దాచుకున్నారు. అందువలన శారదకి అత్తమామలు దైవ స్వరూపులు.

సుబ్బారావు, హైమవతి పుట్టిన చాలా కాలం తరువాత అంటే పదమూడేళ్ళకి, రెండేసేళ్ళ తేడాతో ముగ్గురు మగ పిల్లలు, కృష్ణ, రవి, ప్రసాద్ కలిగారు ఆ దంపతులకు. హైమవతి పెద్ద కొడుకు ముకుందం, చిన్న తమ్ముడు ప్రసాద్ లది ఇంచుమించు ఒకే వయసు.

హైమవతి పెళ్ళి అయిన మూడేళ్ళ తరువాత సుబ్బారావు పెళ్ళి జరిగింది. కోడలు కాపురానికి వచ్చే లోపుగానే అనుకోకుండా ముగ్గురు మగపిల్లలు పుట్టారు సుబ్బమ్మకు. ఆవిడ ఆ కాన్పు లెక్కడ ఆగవో అని సిగ్గుపడి, భయపడి పోయింది. ఆఖరి వాడు ప్రసాద్ శారద కాపురానికి వచ్చేసరికి నెలల పిల్లవాడు. హైమవతిని కాపురానికి పంపిన రెండేళ్ళ లోపే కోడలు శారద ఇంట్లో అడుగు పెట్టింది.

మంచి పనిమంతురాలు, బుద్ధిమంతురాలు అయిన శారద తన నైపుణ్యంతో, మంచితనంతో త్వరలోనే అందరికీ తలలో నాలికయ్యింది. ముఖ్యంగా అత్తగారి అభిమానానికి పాత్రురాలయ్యింది. అత్తమామలంటే ఎంతో గౌరవం, భర్తంటే అమితమైన ప్రేమ ఉన్న శారదకు మరుదులు, ఆడపడుచు అంటే చాలా ఇష్టం. అందులోనూ ఇంచుమించు తన వయసుదే అయిన ఆడపడుచంటే ఎనలేని అనురాగం. ఆఖరి మరిది ప్రసాదుని ఎప్పుడూ చంకలో వేసుకు తిరగటం శారదకు అలవాటు.

కాపురానికి వచ్చే నాటికి శారద వయసు పదహారేళ్లు. ఆమె వచ్చేనాటికి హైమవతి మొదటి కాన్పు అయి, పసివాడు ముకుందంతో సహా అత్తారింటికి వెళ్ళింది. తరువాత హైమవతికి ఇద్దరు పిల్లలు రాజేశ్వరి, మురారి కలిగారు కానీ శారద కడుపు ఇంకా పండలేదు. అదొక్కటే ఆమె మనసును అప్పుడప్పుడు కలచి వేస్తుంటుంది. మరుదులను సొంత పిల్లలుగా చూసుకునే శారదకు తను గొడ్రాలిననే భయం మనసులో స్థిరపడి పోతోంది. అయితే అత్తమామలు కానీ, భర్త కానీ ఆ విషయంలో ఆమెను ఎన్నడూ ఒక్క మాట కూడా అనలేదు. పైపెచ్చు అత్తగారు కోడల్ని బాధపడొద్దని ఓదారుస్తుంటుంది.

మగవాడైన కేశవరావు స్వాతంత్ర్య పోరాటంలో చేరటంలో ఆశ్చర్యం లేదు కానీ, ఇంట్లో ముగ్గురు పసిపిల్ల లున్నప్పటికీ, సుబ్బమ్మగారు స్వతంత్ర సమరంలో దూకటానికి నడుం బిగించటమే దిగ్భ్రమ కలిగించే విషయం. దేశసేవలో మునిగిన ఆమెకి, కోడలు కాపురానికి రావటం ఎంతో కలిసి వచ్చిందనే చెప్పాలి. ఇంటి బాధ్యతలన్నీ ఆమెకు అప్పచెప్పి, దేశ భక్తురాలిగా తన బాధ్యతను నిర్వహించటానికి ముందు కురికింది సుబ్బమ్మ. అనతి కాలంలోనే తమ అంకిత భావంతో ఆ గ్రామంలోని స్వాతంత్ర యోధులందరికి సుబ్బమ్మ, కేశవరరావు గార్లే నాయకు లయ్యారు.. గాంధీజీ అడుగు జాడలలో నడుస్తూ, స్వాతంత్ర సముపార్జనకు తమ వంతు కృషి సలుపుతున్నారు ఆ దంపతులు. వ్యక్తి కంటే కుటుంబం, కుటుంబం కంటే సమాజం, సమాజం కంటే దేశం ముఖ్యమైనవని త్రికరణ శుద్ధిగా నమ్మి ఆచరించే దంపతులు వారు.అందుకే సమాజానికి, దేశానికి తమ వంతు సేవ చెయ్యటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు.

రాట్నం వడికి నూలు తీయటంలో సుబ్బమ్మగారిది అందెవేసిన చెయ్యి.రాట్నం వడుకుతూ ఆమె,

"స్వరాజ్యమే మన జన్మ హక్కని సమస్త జగతికి చాటండి"

అని శ్రావ్యమైన గొంతుతో పాడుతూ ఉంటె, ఊళ్లోని వారందరు ఆమెతో పాటు గొంతు కలిపి పాడేవారు. ఆమె ఒడికిన నూలుతో నేసిన ఖద్దరు దుస్తులను మాత్రమే కేశవరావు గారు ధరించేవారు. అది గర్వకారణంగా భావించటమే కాక, తన గ్రామంలో ప్రజలందరినీ ఖద్దరు ధారణకు ప్రోత్సహించేవారు. దాంతో ఊరిలోని ఆడవారందరూ సుబ్బమ్మగారి దగ్గర నూలు వడకటం నేర్చుకున్నారు. ఫలితంగా ఆ ఊరిలో ఖద్దరు ధారణ పెరిగింది. విదేశీ వస్తువులని బహిష్కరించాలని జాతీయ నాయకుల పిలుపు ఊరి ప్రజలకు అందజేసి, అందరి చేతా విదేశీ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిలిపి వేసేలా చేసింది కేశవరావు గారే. అలాగే గాంధీజీ గారి పిలుపు మీద శాసనోల్లంఘనాన్ని సంపూర్ణంగా విజయవంతం చేయగలిగారు ఆ దంపతులు.

స్వాతంత్రోద్యమంలో కుటుంబాన్ని విడిచి దేశమంతటా తిరుగుతూ ప్రజలను ఉత్తేజ పరుస్తున్న పోరాట వీరులు ఆ చుట్టు పక్కల ఏ గ్రామానికి వచ్చినా, విడిది కేశవరావు గారి ఇంట్లోనే. తన సొంత డబ్బుతో వారందరికీ వసతి, భోజనాల ఏర్పాట్లు చేసేవాడాయన. సుబ్బమ్మ ఇరుగు పొరుగు స్త్రీల సహాయంతో అటువంటి వారికి వండి పెట్టటమేకాక, వారు తిరుగు ప్రయాణానికి సిద్ధపడ్డప్పుడు దారి ఖర్చులకి కొంత పైకం కూడా ఇచ్చేది. ఆ విధంగానే ఆ దంపతు లిద్దరికీ దేశం కోసం పోరాడుతున్న ఎంతో మంది గొప్ప గొప్ప నాయకులతో పరిచయాలు ఏర్పడ్డాయి.

ఇక అప్పట్లో వస్తున్న పత్రికలలో స్వాతంత్ర్య సమరానికి సంబంధించిన వార్తలు చదివి, రచ్చబండ దగ్గర అందరికీ వినిపించటం, వివరించటం కేశవరావు గారి దినచర్య. స్వాతంత్రోద్యమంలో భాగంగా జాతీయ నాయకులు ఏ పిలుపు

నిచ్చినా ఆ ఊరి ప్రజలు విశేషంగా స్పందించే వారంటే, అందుకు కేశవరావుగారు వాళ్ళను ఉత్తేజ పరిచే విధానమే ప్రధాన కారణం.

ఒకసారి మహాత్మా గాంధీ దేశం కోసం విరాళాలను సేకరిస్తున్నారని తెలిసి, తమ ఊరి వారి నుంచి చందాలు సేకరించి, దానికి తన వంతుగా ఆ సంవత్సరం పంట అమ్మగా వచ్చిన డబ్బు అంతటిని కలిపి ఇచ్చేసాడు కేశవరావు. ఊరు ఊరంతా దానిని ఎంతో గొప్పగా చెప్పుకున్నారు. ఆయన అలా చేసినా, సుబ్బమ్మగారు దేశంకోసం అని మనస్ఫూర్తిగా సంతోషించింది తప్ప ఆయనను ప్రశ్నించనూ లేదు, విమర్శించనూ లేదు.అటువంటి అపూర్వమైనది సుబ్బమ్మగారి వ్యక్తిత్వం. భరతమాత ఇలాంటి ఆణిముత్యా లెన్నిటిని దేశానికి అందించిందో!

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS